క్లుప్తంగా

బరి ఏర్పాటు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో తేలప్రోలు- ఉయ్యూరు ప్రధాన రహదారికి సమీపంలో నందమూరు వద్ద జూద శిబిరం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కోడి పందేలు వేసేందుకు బరిని ఏర్పాటు చేస్తున్నారు. ఉంగుటూరులో పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో కూటమి నేతల కనుసన్నల్లో రాత్రి సమయంలో పేకాట నిర్వహిస్తున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

వక్ఫ్ ఆస్తులు ధ్వంసం చేసిన వ్యక్తులపై కేసు

పెనమలూరు: యనమలకుదురులో కబరస్తాన్, ఈద్గా, మసీదు ఆస్తుల్లోకి అక్రమంగా ప్రవేశించి ధ్వంసం చేసిన వ్యక్తులపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ జె.వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6వ తేదీన మసీదుకు చెందిన షాపు నంబర్ 20కి తాళం వేసి ఉండగా యనమలకుదురుకు చెందిన షేక్ అష్రఫ్, షేక్ సలీం, షేక్ సాల్మన్, షేక్ కరీముల్లా, షేక్ మస్తాన్ షాపు తాళం పగులకొట్టి ఆక్రమంగా ప్రవేశించారని వక్ఫ్ ఆడిటర్, ఇన్‌స్పెక్టర్ ఏడీ నూహుఆలీషా పెనమలూరు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ నెల 9వ తేదీన పై వ్యక్తులు మసీదులోని ఆఫీసులోకి అక్రమంగా ప్రవేశించి ఆఫీసు బ్యానర్ ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది సీసీ కెమెరాలో రికార్డు అయినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు వివరించారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తులపై కేసు

పెనమలూరు: మహిళపై దాడి చేసిన వ్యక్తలపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు కామయ్యతోపునకు చెందిన షేక్ హసీనాసుల్తానా కుటుంబ సభ్యులతో నివశిస్తోంది. ఆమె ఇంటి పక్కనే నసీమా కుటుంబ సభ్యులతో ఉంటుంది. నసీమా కుటుంబ సభ్యుల గురించి హసీనాసుల్తానా చెడుగా చెబుతుందనే అనుమానంతో వీరి మధ్య గొడవ జరిగి మాట్లాడుకోవటం లేదు. కాగా ఈ విషయమై నసీమా, ఆమె కొడుకు ముష్రాఫ్, రిజ్వానా మరికొందరు హసీనాసుల్తానా ఇంట్లోకి ప్రవేశించి సామాను ధ్వంసం చేసి ఆమెపై దాడి చేశారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయటంతో దాడి చేసిన వారిపై కేసు నమోదు చేశారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పెనమలూరు: భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు మురళీనగర్‌కు చెందిన జి.మల్లికామహేశ్వరి భర్త కోటాగణేష్, కుమారుడు నివశిస్తున్నారు. కాగా ఈ నెల 8న వాట్సప్ మెసేజ్‌ల విషయంలో భార్యభర్తలకు మధ్య గొడవ జరిగింది. కాగా భర్త 9వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భార్య భర్తకు ఫోన్ చేసినా, వాట్సప్ మెసేజ్ పెట్టినా స్పందించ లేదు. దీంతో బాధితురాలు చేసిన ఫిర్యాదు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

భర్త చేతిలో గాయపడిన భార్య మృతి

గన్నవరం: మద్యపానానికి బానిసైన ఓ వ్యక్తి ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను విచక్షణారహితంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై గన్నవరం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. లారీ డ్రైవర్ అయినా దగాని వరప్రసాద్ 15 ఏళ్ల క్రితం సుమలత (35)ను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. వరప్రసాద్ కుటుంబం దావాజిగూడెంలోని పామర్తినగర్‌లో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఇటీవల మద్యానికి బానిసైన వరప్రసాద్ తాగివచ్చి తరుచూ భార్యతో గొడవ పడుతున్నాడు. ఈ నెల 2న భర్త కొట్టడంతో సుమలత స్పృహ తప్పి పడిపోయింది. ఇంటి యాజమాని ద్వారా సమాచారం తెలుసుకున్న బంధువులు ఆమెను చికిత్స నిమిత్తం చిన్నఅవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమెను ఈ నెల 5వ తేదీ అర్ధరాత్రి వరప్రసాద్ బలవంతంగా ఇంటికి తీసుకువెళ్లాడు. ఉదయం ఆస్పత్రికి వెళ్లిన ఆమె బంధువులకు సిబ్బంది విషయం తెలిపారు. దీంతో ఇంటివద్ద అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సుమలత మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు ఆమె భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

గన్నవరం: మండలంలోని మర్లపాలెంలో జాతీయ రహదారి బైపాస్‌పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్‌లో స్థిరపడిన అమలాపురానికి చెందిన శివప్రసాద్ సంక్రాంతి పండుగకు కుటుంబ సభ్యులతో కలిసి కారులో బయలుదేరారు. కారు జాతీయ రహదారి బైపాస్ మీదుగా మర్లపాలెం వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన మరో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివప్రసాద్, ఆతని భార్య, పిల్లలు, బామ్మర్దికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం చిన్నఆవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

వక్ఫ్ భూముల్లో 'బరి' తెగింపు

- కోడిపందేలకు ఏర్పాట్లు చేసిన కూటమి నేతలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- పైకి సంబరాలు లోపల జూద క్రీడలు
- రామవరప్పాడు, ఎనికేపాడులో భారీ బరులు



రామవరప్పాడు ఫ్లైఓవర్ సమీపంలో ఏర్పాటైన బరి

పెనమలూరు: వక్ఫ్ భూముల్లో కోడి పందేలు, ఇతర జూద క్రీడలు నిర్వహించేందుకు కూటమి నేతల రంగం సిద్ధం చేశారు. పవిత్రమైన వక్ఫ్ భూముల్లో నేతలు బరి తెగిస్తున్నా అధికారులు చోద్యం చూడటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆటపాటలకు బదులుగా..

సంస్కృతి ఉట్టిపడే ఆటపాటలకు బదులుగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత జూద క్రీడలకు తెరలేపారు. అంతటితో ఆగకుండా ఏకంగా వక్ఫ్ భూములపై కన్నేశారు. తాడిగడప - పెదపులిపాక హద్దులో దాదాపు 20 ఎకరాలకుపైగా ఉన్న వక్ఫ్ భూముల్లో కోడి పందేలు, జూదక్రీడలు నిర్వహించటానికి బరులు సిద్ధం చేశారు. ఫెన్సింగ్ పోల్స్ వేశారు. పొలాన్ని రోలర్‌తో చదును చేశారు. నేటి నుంచే.. ఆదివారం నుంచి కోడి పందేలు, పేకాట, ఇతర జూద క్రీడలు నిర్వహించటానికి రంగం సిద్ధం చేశారు. అత్యంత విలువైన వక్ఫ్ భూములు గత కొద్ది కాలంగా బడా వ్యక్తి చేతుల్లో ఉండగా, తాజాగా చట్టవిరుద్ధంగా ఈ భూముల్లో కోడిపందేలు, జూదం నిర్వహించటం వివాదాస్పదంగా మారింది.

పేరుకే కమిటీలు..

సంక్రాంతికి జూద క్రీడలు, కోడి పందేలు నిర్వహించరాదని కోర్టు ఆదేశాలు ఉన్నాయి. వీటి నివారణకు మండల స్థాయిలో అధికారులు ప్రత్యేక టీమ్‌లు వేశారు. కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలు చేశారు. ఏకంగా వక్ఫ్ భూముల్లోనే కోడి పందేలకు శిబిరం ఏర్పాటు చేశారు. దీంతో అధికారుల పని తీరుపై ఆరోపణలు వెల్లువెతుత్తున్నాయి. కూటమి నేతలు అడ్డంగా సొమ్ము దండుకోవటానికి పాపభీతి లేకుండా ఏకంగా వక్ఫు భూములనే జూద క్రీడలకు ప్రాంగణంగా ఎంపిక చేసుకోవటం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఇప్పటికైనా అధికారులు, వక్ఫు బోర్డు పర్యవేక్షకులు స్పందించి భూమి కౌలుదారుడు, జూదక్రీడలు నిర్వహిస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటుందో లేదో వేచి చూడాల్సి ఉంది.



తాడిగడప- పెదపులిపాక హద్దులో వక్ఫ్ భూమిలో వేసిన కోడిపందేల బరి



సూరంపల్లిలో సిద్ధంచేస్తున్న గుడారాలు

రామవరప్పాడు: సంక్రాంతి సంబరాల మాటున కోడి పందేలు, జూద క్రీడలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని స్వయంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా టీడీపీ నాయకులు పెడ చెవిన పెడుతున్నారు.

30 ఏళ్ల ఆనవాయితీకి బ్రేక్..

విజయవాడరూరల్ మండలానికి ఒక పక్కగా ఉన్న రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాలు గత 30 సంవత్సరాల నుంచి ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా కోడి పందేలకు దూరంగా ఉంటూ ఒకే మాటపై వస్తున్నారు. ఈ ఆనవాయితీకి తిలోదకాలిస్తూ రామవరప్పాడు ఫ్లైఓవర్ సమీపంలో, ఎనికేపాడు హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో స్థానిక నియోజకవర్గ ప్రజా ప్రతినిధి కనుసన్నల్లో భారీ బరులు ఏర్పాటు చేశారు. రామవరప్పాడులో సుమారు 10 ఎకరాల పొలాల్లో టీడీపీ నాయకులు, ఓ మాజీ ఉపసర్పంచ్ నేతృత్వంలో, ఎనికేపాడులో మరో 10 ఎకరాల్లో ఓ మాజీ సర్పంచ్ కుమారుడి నేతృత్వంలో బరులు ఏర్పాటు చేశారు.

ప్రచారం ఒకలా..

తొలుత ముగ్గుల పోటీలు, వాలీ బాల్ క్రీడలు, పెట్ డాగ్ ప్రదర్శనలంటూ కరపత్రాలను ముద్రించి గ్రామాల్లో పంచి పెట్టారు. తీరా పండుగ దగ్గర పడటంతో వీరి నిజ స్వరూపం బయట పడింది. క్రేన్లు, బుల్డోజర్లతో బరులను చదును చేయించారు. ఒక్కొక్క బరిలో వందల మంది పట్టే విధంగా రింగ్‌లు, కంచెల ఏర్పాటు పూర్తి చేశారు.

పర్యవేక్షణకు కమిటీలు..

ఈ భారీ బరులు పర్యవేక్షించేందుకు టీడీపీ నాయకులు టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో టీమ్ ఒక్కో జూద స్టాళ్లను పర్యవేక్షించనున్నారు. చిన్న బజారు- పెద్ద బజారు, లోపల బయట, సీక్వెన్స్, గుండాట, నెంబర్లాట, కోళ్ల బరులును విడి విడిగా విభజించి వీరికి అప్పగించినట్లు సమాచారం. జూద స్టాళ్ల నుంచి లక్షల్లో వసూలు చేశారు. అన్ని స్టాళ్ల నుంచి కొన్ని కోట్ల రూపాయలు వసూలు పూర్తయినట్లు తెలిసింది. రామవరప్పాడు బరి వద్ద పార్కింగ్‌కే లక్షల్లో ఫీజు వసూలు చేశారు. రామవరప్పాడు, ఎనికేపాడు బరులలో క్యాసినో నిర్వహించడానికి గోవా నుంచి సిబ్బందిని కూడా రప్పిస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. రామవరప్పాడు ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బరి హోం మంత్రి వంగలపూడి అనిత ఇంటి సమీపంలోనే ఏర్పాటు చేయడం విశేషం.

గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేల బరులు సిద్ధం చేస్తున్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో జూదరులను ఆకట్టుకునేలా తగిన ఏర్పాట్లు చేశారు. సూరంపల్లి సమీపంలోని వెంచర్‌లో భారీ ఎత్తున సెట్టింగ్‌లు చేస్తున్నారు. కోడి పందేలతో పాటు గుండాట, పేకాట నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లుగా తెలుస్తోంది. గోపవరపుగూడెం, తెంపల్లి, పురుషోత్తపట్నం రైల్వే గేటు సమీపంలో బరులను సిద్ధం చేస్తున్నారు.

రెండో రోజు మున్సిపాలిటీ వ్యాన్‌డ్రైవర్ల ధర్నా



పెనమలూరు: సంక్రాంతి పండుగ సమయాన జీతాలు లేక పస్తులుంటున్నాం.. ప్రభుత్వం ఇకనైనా వ్యాన్ డ్రైవర్లకు జీతాలు ఇవ్వాలని కోరుతూ పోరంకిలో మున్సిపాలిటీ కార్యాలయం వద్ద శనివారం తడిచెత్త- పొడిచెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లు 2వ రోజు సమ్మెలో భాగంగా ధర్నా చేశారు. మండల సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ పండుగకు ముందే జీతాలు ఇస్తామని కమిషనర్ వ్యాన్ డ్రైవర్లకు హామీ ఇచ్చి మాటతప్పారన్నారు. కార్మికులను రోడ్డు పాలు చేసిన కంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ కార్మికులకు నేరుగా జీతాలు చెల్లించాలన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కమిషనర్ భవాని ప్రసాద్ ఇప్పటికైనా ఆస్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి షేక్ కాశిం మాట్లాడుతూ కార్మికులకు సీపీఎం పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. అధికారులు న్యాయం చేయక పోతే ఇతర సంఘాలతో కలిసి సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నేతలు మస్తాన్‌వలి, రవికుమార్, రాంబాబు, కృష్ణ, చిన్ని, రాజు, కార్మికులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఉయ్యూరు: గాలిపటాలు ఎగరవేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ తెలిపారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా చిన్నారులు, విద్యార్థులు గాలిపటాలు ఎగరవేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్ లైన్లకు దూరంగా, ఖాళీస్థలాల్లో పతంగులు ఎగరవేసుకోవాలి. తల్లిదండ్రులు తమ పిల్లలతో దగ్గరుండి గాలిపటాలు ఎగరవేయించాలన్నారు.

పేరంటాలమ్మ ఆలయం ముస్తాబు

రేపటి నుంచి పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు

రామవరప్పాడు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం సంక్రాంతి ఉత్సవాలకు ముస్తాబైంది. ప్రతి సంవత్సరం వైభవంగా ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏర్పాట్లు పూర్తి..

ఈనెల 13 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు, తాగునీటి వసతి, మొక్కుబడులు నిర్వహించుకునేందుకు వీలుగా ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రూట్ మ్యాప్ ప్రకారం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఉత్సవాలకు ముస్తాబైన పేరంటాలమ్మ ఆలయం

ఉత్సవ కార్యక్రమ వివరాలు

13న భోగి సందర్భంగా ఉదయం 5గంటల నుంచి ఆలయ దర్శనం, వాహన పూజలు, మొక్కుబడుల కార్యక్రమాలు ఉంటాయి. 14 మకర సంక్రాంతి సందర్భంగా విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, కుంకుమ పూజలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభమవుతుంది. 6రోజుల పాటు రామవరప్పాడు, ప్రసాదంపాడులో గ్రామోత్సవం పూర్తయిన తర్వాత 18న ఆలయ సమీపంలోని రైవస్ కాలువలో తెప్పోత్సవం, రాత్రి రావిచెట్టు ఎదుట పూలంగి (ఊయల) సేవను నిర్వహిస్తారు. 20న అన్నసంతర్పణ కార్యక్రమంతో సంబరాలు ముగుస్తాయి.

వారంరోజుల పాటు..

వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్తులు, కొత్త అల్లుళ్లు, కూతుళ్లతో పాటు బంధుమిత్రులు తప్పనిసరిగా ఈ ఉత్సవాలకు హాజరై సందడి చేస్తారు. అమ్మవారి గ్రామోత్సవంలో కుటుంబ సమేతంగా పాల్గొంటారు. ఈ జాతరను పురస్కరించుకుని ఆట వస్తువులతో కూడిన దుకాణాలు, జెయింట్ వీల్, కొలంబస్, వీల్‌ఛైర్, డ్రాగన్ ట్రైన్, మ్యూజిక్ ఛైర్‌ల వంటి వినోదాలు పంచే ఎగ్జిబిషన్లు ఏర్పాటయ్యాయి.

ఎట్టకేలకు ఉత్సవ కమిటీ ఏర్పాటు

రామవరప్పాడు: పేరంటాలమ్మ ఉత్సవాల నిర్వహణకు సంక్రాంతి ఉత్సవ కమిటీ ఖరారైంది. రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శనివారం ఉత్సవ కమిటీ సమావేశమైంది. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచనలతో టీడీపీకి చెందిన 33 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో తొలుత పక్క గ్రామం ప్రసాదంపాడుకు చెందిన టీడీపీ నాయకులు సర్నాల బాలాజీ, మాజీ సర్పంచ్ బొప్పన హరికృష్ణ పేర్లును బ్రోచర్‌లో చిట్టచివర ప్రచురించారు. దీంతో వీరిలో వీరికి అంతర్యుద్ధం మొదలైంది. దీంతో బ్రోచర్‌లో వీరి పేర్లును స్టిక్కర్లతో అంటించి నిరంజనరావు, అంగిరేకుల గంగాధరరావు పేర్లను చేర్చారు.

మూలన పడ్డ బ్రోచర్లు

తొలుత ఆలయ ఈఓ పి.ప్రియాంక దాతల పేర్లను ప్రచురించిన బ్రోచర్లను ఆలయంలో ఈనెల 7న ఆవిష్కరించారు. ఈ బ్రోచర్‌లో వైఎస్సార్ సీపీకి చెందిన దాతల పేర్లు ఉండటంతో సుమారు 15 వేలకు పైగా ముద్రించిన ఈ బ్రోచర్లు బయటకు రాకుండా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ దాతల పేర్ల స్థానంలో టీడీపీకి చెందిన నాయకుల పేర్లను కొత్తగా చేరుస్తూ ప్రచురించారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఎన్నో సంవత్సరాల నుంచి సహకరిస్తున్న దాతలను అవమానానికి గురి చేశారంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆలయంలో సమావేశమైన ఉత్సవ కమిటీ సభ్యులు

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



వీకేఆర్ కళాశాలలో భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ శ్రీధర్ బాబు

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు భోగి మంటలు, సంక్రాంతి ఆట పాటలు, పాల పొంగళ్లు, రంగవల్లికలతో సందడి చేశారు. తొలుత వేడుకలను ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు భోగి మంటలను వెలిగించి ప్రారంభించారు. విద్యార్థులు పాటలు పాడుతూ నృత్యాలు వేశారు. పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. దావాజిగూడెంలోని శ్రీరణ అంకమ్మ ఆలయం వద్ద గ్రామ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో శనివారం గ్రామస్తులకు పాఠశాల ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ నేచురోపతి వైద్యులు డాక్టర్ పి.శ్రీధర్‌బాబు విచ్చేసి మాట్లాడుతూ మన సంస్కృతికి ప్రతీక సంక్రాంతి అన్నారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంప్రదాయ దుస్తులతో, గ్రామస్తులు పండుగ వాతావరణాన్ని శోభయమానం చేశారు. కరస్పాండెంట్ షేక్ ఇమాం, ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానాలను ఆయన అభినందించారు. పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ విజయ్, ఉపాధ్యాయులు సుల్తానా, హసీనా, అశోక్ రాణి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎడ్ల పూటీ లాగుడు పోటీలు

కంకిపాడు: కంకిపాడులోని బైపాస్‌మార్గంలో జాతీయ స్థాయి ఎడ్ల పూటీలాగుడు పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. న్యూ జూనియర్స్ ఎడ్లకు నిర్వహించిన పోటీల్లో బాపట్ల జిల్లా అమృతలూరు మండలం పెదపూడికి చెందిన ఏ.కృష్ణ యాదవ్ ఎడ్లజత 3,922 అడుగులు, గుంటూరు జిల్లా గార్లపాడుకు చెందిన రామినేని శ్రీనివాసరావు ఎడ్ల జత 3727 అడుగులు, ఎన్టీఆర్ జిల్లా వత్సవాయికి చెందిన కె.ప్రభాకర్‌రెడ్డి ఎడ్ల జత 3471 అడుగులు దూరం లాగి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. పూటీ లాగుడు పోటీలు ఈనెల 12వ తేదీతో ముగియనున్నాయి. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి.



పోటీ పడుతున్న ఎడ్ల జత

'బరి' టెంట్ల తొలగింపు

కంకిపాడు: సంక్రాంతి బరులపై పోలీసులు నామమాత్రంగా దాడులు నిర్వహించారు. కంటి తుడుపు చర్యగా బరులను ధ్వంసం చేసి చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, జూదం నిర్వహించేందుకు గ్రామాల్లో బరులు రెడీ చేస్తున్నారు. మండలంలోని ఈడుపుగల్లు, కంకిపాడు, గొడవర్రు, ఉప్పులూరు గ్రామాల్లో కూటమి నేతృత్వంలో బరులు ఏర్పాటు చేస్తున్నారు. పండుగ మూడు రోజులు భారీ స్థాయిలో పందేలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. భారీ సెట్టింగులతో బరులు సిద్ధం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసులు బరులను ధ్వంసం చేశారు. అయితే ఇదంతా తూతూమంత్రంగానే సాగింది. రెవెన్యూ, పోలీసు శాఖలు సంయుక్తంగా ఆయా బరుల్లోకి వెళ్లి టెంట్‌లను, అక్కడక్కడా స్తంభాలను తొలగించారు. భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన సెట్టింగులు, ప్రధాన బరుల వద్దకు వెళ్లే ప్రయత్నం చేశారు. పోలీసులు బయటకు రాగానే బరి నిర్వాహకులు బరుల పనుల్లో నిమగ్నమయ్యారు.



కంకిపాడులోని ఓ బరిలో ఉన్న టెంట్ తొలగిస్తున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

సంక్రాంతికి.. సొంతూళ్లకు..



ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో పొట్టిపాడు టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ కొనసాగుతుంది. వారంతం, సంక్రాంతి సెలవులు కావడంతో నగరాల్లో స్థిరపడినవారు, ఉద్యోగులు సొంతూళ్లకు పయనమయ్యారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర నగరాల నుంచి వాహనాలు బారులు తీరాయి. చెన్నై- కోల్‌కత జాతీయ రహదారిపై పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద శనివారం ఉదయం నుంచి వాహనాల రద్దీ కొనసాగుతోంది.

నవదిన ప్రార్థనలు



ఉంగుటూరు: దేవుడు మనుషులను తన పోలికలతో సృష్టించారని ఏలూరు వియాన్ని కాలేజ్, వైస్‌ప్రొవెన్షియల్, కపూచిన్ గురువు ఫాదర్ ప్రవీణ్ గోప్ప అన్నారు. ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లి తంబి పుణ్య క్షేత్రంలో వర్ధంతి మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలు శనివారం ఎనిమిదో రోజుకు చేరాయి. మానవుడు దేవుని ప్రతిరూపం కాబట్టి దైవిక స్వభావం కలిగి ఉంటాడని పేర్కొన్నారు. దేవునికి మహిమ చేకూరుస్తూ జీవించాలని అన్నారు. పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ జోసఫ్ పొలడుగు, విచారణ గురువు అభిలాష్ గోప్ప పాల్గొన్నారు.

ఈవో బాధ్యతల స్వీకరణ



హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా పితాని తారకేశ్వర వీర వెంకట సత్యనారాయణ మూర్తి నియమితులయ్యారు. ఇక్కడ ఈవో బాధ్యతలు నిర్వహిస్తున్న కూచిపూడి శ్రీనివాస్ కొల్లేటి కోట పెద్దింట్లమ్మ దేవస్థానానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ద్రాక్షారామం భీమేశ్వరస్వామి దేవస్థానం నుంచి బదిలీపై వచ్చిన మూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ఆలయ సిబ్బంది, అర్చకులు, పలువురు భక్తులు కలిసి అభినందనలు తెలిపారు.

వైభవంగా కూడారై పర్వదిన వేడుక

దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం కూడారై వేడుకలను జరిపారు. శ్రీగోదాదేవి సమేత శ్రీకృష్ణస్వామివార్లకు 108 గిన్నెలలో పాయసం నైవేద్యంగా నివేదించారు. అనంతరం భక్తులు నగర సంకీర్తన, తిరుప్పావై ప్రబంధ పారాయణం, భగవన్నామ సంకీర్తన జరిపారు. ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు నేతృత్వంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ధనుర్మాస గోష్ఠి సభ్యులు, నగర సంకీర్తన భక్త బృందం, గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2014వ సంవత్సరం నుంచి 2024 వరకు వికాస్‌లో విద్యనభ్యసించి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు కలుసుకొని ఆనందం వ్యక్తం చే శారు. విద్యార్థులుగా అప్పటి విషయాలను గుర్తు చేసుకొంటూ ఉల్లాసంగా గడిపారు. తమ పరిస్థితులను వివరించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కాలేజీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ కళాశాల ప్రగతిని వివరించారు. పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగిమంటలతో సంక్రాంతి సంబరాలను కళాశాల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి ప్రారంభించారు. కళాశాల సెక్రటరీ ఎన్.సత్యనారాయణరెడ్డి, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో జాతీయ స్థాయి టెక్నోఫెస్ట్

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో జాతీయ స్థాయి టెక్నోఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు వీసీ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. కాలేజీలో శనివారం టెక్నోఫెస్ట్ సుప్రజ్ఞ- 2025 పోస్టర్ ఆవిష్కరించి వివ రాలు తెలిపారు. ఫిబ్రవరి 21, 22 తేదీలలో జాతీయ స్థాయిలో టెక్నో- కల్చరల్ ఫెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు.దేశ వ్యాప్తంగా విద్యార్థులు ఈ ఫెస్ట్‌లో పాల్గొని ఆవిష్కణలతో తమ ప్రతిభ చాటడానికి చక్కని అవకాశమన్నారు. సంస్కృతిక కార్యక్రమాలు కూడా జరుగుతాయన్నారు. ప్రోవైస్‌చాన్సలర్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, డీన్‌లో డాక్టర్ డి.వెంకట్రావు, డాక్టర్ డి.పద్మజ, సీహెచ్.రాఘువేంద్ర, జి.వెంకటసుబ్బయ్య, కె.స్నేహ పాల్గొన్నారు.



టెక్నో ఫెస్టు పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ వెంకటేశ్వరరావు, తదితరులు